పార్కు స్థలం ఆక్రమణ.. కూల్చివేసిన అధికారులు

- గంటల వ్యవధిలోనే మళ్లీ నిర్మాణం.. అడ్డుకోబోయిన సంక్షేమ సంఘంపై దాడికి యత్నం.. పోలీసులకు ఫిర్యాదు
- మళ్లీ కూల్చివేసిన అధికారులు

పార్కు స్థలంలో కట్టిన ప్రహరీని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

దుండిగల్, నవంబర్ 23 : వివాదాస్పద పార్కు స్థలంలో నిర్మించిన ప్రహరి నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేసిన గంటల వ్యవధిలోనే అక్రమార్కులు మందీమార్బలంతో మళ్లీ ఫెన్సింగ్ వేశారు. అడ్డుకోబోయిన సంక్షేమ సంఘం ప్రతినిధులపై సిబ్బందితో కలిసి దాడికి యత్నించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 105లో ఉన్న సిద్ధివినాయకనగర్‌లో 1080 గజాల పార్కు స్థలం ఉన్నది. బాలానగర్-నర్సాపూర్ ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉండటంతో రూ.6 నుంచి 8 కోట్ల వరకు దీని ధర పలుకుతుంది. దీంతో ఈ స్థలాన్ని ఎలాగైనా కాజేయాలని పక్కనే ఉన్న ప్రైవేట్ టాన్స్‌పోర్ట్ సంస్థ ముమ్మర ప్రయత్నం చేస్తున్నది. పార్కుస్థలంలో తమకు చెందిన బస్సులు, ఇతర వాహనాలను నిలుపుతూ చుట్టూ ప్రహరీని, రెండు గదులను నిర్మించింది. అయితే సదరు స్థలం తమ సిద్ధివినాయకనగర్ కాలనీకి చెందిన పార్కు స్థలమంటూ అసోసియేషన్ ప్రతినిధులు గతకొన్నేండ్లుగా సదరు ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంతో న్యాయపోరాటం చేస్తున్నారు. ఇటీవల సిద్ధివినాయకనగర్ ఓనర్స్ అసోసియేషన్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో అసోసియేషన్ ప్రతినిధులు కోర్టు ఆర్డర్ ప్రతులను గాజులరామారం సర్కిల్ అధికారులకు అందజేసి చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో శనివారం ఉదయం గాజులరామారం సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పార్కు స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీతోపాటు లోపల నిర్మించిన రెండు గదులను నేల మట్టం చేశారు. అయితే ఇది ఎంతమాత్రం జీర్ణించుకోలేని ట్రాన్స్‌పోర్ట్ సంస్థ యజమానులు జితేంద్ర, యుగేంద్ర తమ సిబ్బందితో కలిసి సదరు పార్కుస్థలం చుట్టూ కర్రలతో ఫెన్సింగ్ వేస్తుండటంతో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులపై వారు తమ సిబ్బందితో దౌర్జన్యానికి దిగడంతోపాటు దాడికి యత్నించడంతో అసోసియేషన్ ప్రతినిధులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలాన్ని కాపాడటంతోపాటు తమపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయమై సీఐ భరత్ కుమార్‌ను వివరణ కోరగా.. సిద్ధివినాయకనగర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారని వివరణ ఇచ్చారు.

కిరాణా దుకాణంలో 35 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 23 : కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ కిరాణం షాపులో కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోని తీసుకుని.. అతని వద్ద 35 కేజీ కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన ప్రకారం...కేపీహెచ్‌బీ కాలనీలో ఎంఐజీ 10, మార్కెట్ రోడ్డులోని శ్రీసిద్ధివినాయక జనరల్ స్టోర్‌లో కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌ను విక్రయిస్తున్నాడని కాలనీకి చెందిన ఎం.సురేందర్ అనే వ్యక్తి కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. స్పందించిన పోలీసులు కాలనీలోని జనరల్ స్టోర్‌కి వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేయగా.. కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టు దొరికింది. షాపు నిర్వాహకుడు ఓంప్రకాశ్(44) రాజస్థాన్ రాష్ట్రం, జోధ్‌పూర్ జిల్లా, హరియధన మండలం, తివారియోకి ధన గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతను గత 6 ఏండ్లుగా హోల్‌సేల్ డీలర్ దీపక్ అనే వ్యక్తి వద్ద అల్లంవెల్లుల్లి పేస్టును కొనుగోలు చేస్తున్నాడు. ఎంఆర్‌పీపై 10 రాయితీ ఇస్తుండటంతో అదనపు లాభాల కోసం కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును కొనుగోలు చేస్తున్నాడు. 200 గ్రాములు, 0.5కేజీ, 1కేజీ, 5 కేజీల విధంగా కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టు డబ్బాలను కొనుగోలు చేస్తూ వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఈ కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టులపై గడువు ముగిసే తేదీ(ఎక్స్‌పైర్ డేట్)లేకపోవడం, ఆ షాపులో ఉన్న పేస్ట్‌లో కల్తీ ఉందని నిర్ధారించారు. ఈ కిరాణం షాపులో 35 కేజీల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టు డబ్బాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు ఓంప్రకాశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అల్లం వెల్లుల్లి పేస్టు నాణ్యతను గుర్తించాలని జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారాన్ని అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగని నకిలీ వైద్యం దందా

- నగరంలో పెరిగిపోతున్న నకిలీ వైద్యుల ఆగడాలు
- ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని అధికారులు
- పలు క్లినిక్‌లపై మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులు
- 10 మంది నకిలీ వైద్యులపై కేసు నమోదు

నకిలీ వైద్యుడి క్లినిక్‌ను తనిఖీ చేసిన అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): నగరంలో నకిలీ వైద్యులు కలకలం సృష్టిస్తున్నారు. అర్హత లేకున్నా నాసిరకం వైద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తున్నారు. సంబంధిత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ నకిలీ వైద్యుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఈ మధ్య కాలంలో నగరంలోని పలు దవాఖానల్లో తరచూ వైద్యం వికటించి రోగులు మృత్యువాత పడుతున్న ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున దవాఖానలు, క్లినిక్‌లపై దాడులు నిర్వహిస్తున్నది. ఈ క్రమంలోనే శనివారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని కర్మాన్‌ఘాట్, చంపాపేట్, సైదాబాద్‌లోని పలు క్లినిక్‌లపై తెలంగాణ వైస్ చైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలి అధికారులు పెద్దఎత్తున దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా 20 క్లినిక్‌లలో తనిఖీలు జరుపగా, 10 మంది నకిలీ వైద్యుల గుట్టు రట్టు అయ్యింది. ఇందులో నియమాలకు విరుద్ధంగా క్లినిక్‌లలో పడకలు నిర్వహించడం, రోగులకు సెలైన్‌లు పెట్టడం, యాంటీ బయోటిక్ మందులు ఇవ్వడం, స్టీరాయిడ్ ఇంజిక్షన్స్ ఇవ్వడం, ఆయుర్వేదిక్ వైద్యులు నియమాలకు విరుద్ధంగా గర్భిణులకు అలోపతి మందులు ఇవ్వడం, హైడోస్ యాంటీ బయోటిక్ మందులు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డా.శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు నకిలీ వైద్యులపై ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. అంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా గర్భిణులకు అలోపతి మందులు, హై డోస్ యాంటీ బయోటిక్ మందులు ఇస్తున్న ఆయుర్వేదిక్ వైద్యులు డా.రాధాకుమారి, డా.రమేశ్, డా.వీరేశ్‌లపై ఆయుష్ కౌన్సిల్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైద్య మండలి సభ్యులు డా.ఇమ్రాన్ అలీ, డా.రాజీవ్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 350 మంది నకిలీ వైద్యులను గుర్తించి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, వాటిలో కొన్ని చార్జిషీట్‌లు కూడా త్వరలోనే పూర్తి ఆధారాలతో దాఖలు చేయనున్నట్లు తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డా.గుండగాని శ్రీనివాస్ వెల్లడించారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే నకిలీ వైద్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మాయని మచ్చ

మానవత్వం మంటగలిసింది..

- తల్లి పొత్తిళ్లలో పడుకోవాల్సిన పసికందు గంటల్లోనే అనాథ అయ్యింది..
- అప్పుడే పుట్టిన పసి కందును భవనం టెర్రస్‌పై వదిలేసిన కర్కశ తల్లి
- పాల కోసం గుక్కపట్టి ఏడ్చిన పసికందు.. పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు

పసికందుకు దవాఖానలో ప్రాథమిక చికిత్స చేయించి నీలోఫర్ దవాఖానకు తరలిస్తున్న ఎస్ఐ భరత్‌కుమార్

మలక్‌పేట, నవంబర్ 23: మానవత్వం మంటగలిసింది.. తల్లి ప్రేమకు ఆ చిన్నారి దూరమైంది.. అమ్మతనం నివ్వెరపోయేలా.. అమ్మ పొత్తిళ్లలో హాయిగా పడుకోవాల్సిన పసికందు గంటల్లోనే అనాథ అయ్యింది. అప్పుడే పుట్టిన పసికందును మానవత్వంలేని ఓ తల్లి భవనం టెర్రస్‌పై ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయింది. చనుపాల అమృతం కోసం గుక్కపట్టి ఏడ్చినా ఆ కర్కశ తల్లి మనస్సు కరగలేదు గాక కనీసం పసికందుకు చిన్న బట్ట కూడా చుట్టలేదు. పసికందు అరుపులు విన్న స్థానికులు భవనంపైకి వెళ్లి చూడగా.. ఒకటి, రెండు గంటల కిందట పుట్టిన పసికందు(బాలుడు) కనిపించాడు. అమ్మతానికి.. మానవత్వానికే మాయని మచ్చగా నిల్చిన ఈ ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్ మహరాజ్ హోటల్ వెనుకాల చోటుచేసుకున్నది. ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. శనివారం ఉదయం 6:30 గంటలకు స్థానికులు 100కు డయల్ చేసి వాహెద్‌నగర్‌లోని మహరాజ్ హోటల్ వెనుకాల ఓ భవనం టెర్రస్‌పై అప్పుడే పుట్టిన పసికందు(బాలుడు)ను ఎవరో వదిలేసి వెళ్లారని, బాలుడు గుక్కపట్టి ఏడుస్తున్నాడని తెలిపారు. సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ ఎస్ఐ తన సిబ్బందితో హుటాహుటిన భవనం టెర్రస్‌పైకి వెళ్లి చూడగా గంట, రెండు గంటల కిందట పుట్టిన పసికందు(బాలుడు) కనిపించాడు. దాంతో ఆ పసికందును వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు నీలోఫర్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి సంరక్షణకు చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్(పిల్లల సంరక్షణ కేంద్రం)కు సమాచారం అందించి వారికి అప్పగించారు. భవనాలు ఒకదానినొకటి ఆనుకొని ఉండటంతో ఎవరో పెండ్లి కాకుండా తల్లైన మహిళ పసికందును వదిలేసిపోయి ఉంటుందని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ పసికందు ఆరోగ్యంగానే ఉన్నాడని పోలీసులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'నీలోఫర్'లో పసికందు కిడ్నాప్

- దవాఖాన సిబ్బందినని చెప్పి ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని మహిళ
- నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో పసికందు తల్లి ఫిర్యాదు

నీలోఫర్ దవాఖానలో అదృశ్యమైన నెలరోజుల పసికందు

దవాఖానలో బోరున విలపిస్తున్న పసికందు తల్లి, అమ్మమ్మ

సుల్తాన్‌బజార్, నవంబర్ 23: చిన్నారుల అదృశ్యానికి చిరునామాగా మారిన నీలోఫర్ దవాఖానలో మరోసారి నెలరోజుల పసికందు కిడ్నాప్ తీవ్ర కలకలం రేపింది. దవాఖాన సిబ్బందినని చెప్పి అమ్మమ్మ వద్ద నుంచి నెలరోజుల పసికందును గుర్తు తెలియని మహిళ ఎత్తుకెళ్లింది. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫార్ దంపతులకు చెందిన నెలరోజుల పసికందు అనారోగ్యం బారిన పడటంతో అక్టోబర్ 29వ తేదీన నీలోఫర్ దవాఖానలో అడ్మిట్ చేశారు. కాగా, చికిత్స పొంది, కోలుకున్న పసికందును శనివారం దవాఖాన వైద్యులు డిశ్చార్జి చేశారు. అనంతరం దవాఖాన పాత భవనంలోని ఆరోగ్యశ్రీ కౌంటర్ వద్ద రవాణా ఖర్చులు తీసుకుని ఫొటో దిగుతుండగా.. పక్కనే ఉన్న గుర్తుతెలియని మహిళ వచ్చి చిన్నారిని తనకు ఇచ్చి ఫొటో దిగాలని చిన్నారి తల్లి హసీనాబేగంకు సూచించింది. ఆమె మాటలు నమ్మిన హసీనాబేగం చిన్నారిని గుర్తుతెలియని మహిళకు ఇచ్చి ఫొటో దిగి, తిరిగి చూసేసరికి సదరు మహిళ అక్కడ కనిపించలేదు. దీంతో దవాఖాన మొత్తం కలియతిరిగినా ఆ చిన్నారిని ఎత్తుకెళ్లిన మహిళ కనిపించలేదు. చేసేదిలేక తన బిడ్డ ఆచూకీ తెలుపాలని బోరున విలపిస్తూ హసీనాబేగం దవాఖాన సూపరింటెండెంట్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నీలోఫర్ దవాఖానలో గతంలో కూడా పలుమార్లు చిన్నారులు కిడ్నాప్‌నకు గురైన సంఘటనలు విదితమే. దీంతో దవాఖానలో పటిష్టమైన నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కిడ్నాపర్లు యథేచ్ఛగా దవాఖానలో తిష్టవేసి అమాయక తల్లిదండ్రుల నుంచి చిన్నారులను గద్దల్లా ఎత్తుకెళ్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫోన్ హ్యాక్.. క్రెడిట్ కార్డుల్లోని నగదు మాయం

మన్సూరాబాద్, నవంబర్ 23: ఓ వ్యక్తికి చెందిన సెల్ ఫోన్‌ను హ్యాక్ చేసి క్రెడిట్ కార్డుల్లోని నగదును నిందితులు కొల్లగొట్టిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, హస్తినాపురం నార్త్, కస్తూరికాలనీకి చెందిన పల్లా వెంకట్‌రెడ్డి(41) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వెంకట్‌రెడ్డి సెల్‌ఫోన్‌లోని వాట్సాప్ నంబర్‌కు ఏపీకే ఫైల్ (పీఎం కిసాన్) యోజనకు సంబంధించిన ఫైల్ వచ్చింది. ఫైల్‌ను వెంకట్‌రెడ్డి ఓపెన్ చేయగానే.. ఫోన్ హ్యాక్ అవ్వడం జరిగింది. వెంకట్‌రెడ్డికి చెందిన ఇండస్‌ల్యాండ్, ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డుల నుంచి రూ. 1,35,528లక్షల నగదు నిందితుల ఖాతాల్లోకి బదిలీ అయ్యింది. ఈ విషయాన్ని గుర్తించిన వెంకట్‌రెడ్డి సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్: 1930కు ఫిర్యాదు చేశాడు. పల్లా వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ సీవరేజీ కనెక్షన్ తొలగింపు

- అక్రమంగా కనెక్షన్లు తీసుకుంటే క్రిమినల్ కేసులు
- అనుమతిలేనివి గుర్తిస్తే ఫిర్యాదు చేయండి

కింగ్స్ రెస్టారెంట్ వద్ద అక్రమ సీవరేజీ కనెక్షన్‌ను తొలగిస్తున్న అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): జలమండలి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రెస్టారెంట్ తీసుకున్న సీవరేజీ కనెక్షన్‌ను అధికారులు శనివారం తొలిగించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-3 పరిధి మెహిదీపట్నంలోని కింగ్స్ రెస్టారెంట్ యజమానులు అనుమతి లేకుండా 250 ఎంఎం డయా సీవరేజీ పైపులైన్ కనెక్షన్ తీసుకున్నారు. దీంతోపాటు ఆ రెస్టారెంట్ నుంచి వచ్చే అధిక సీవరేజీ వల్ల మెయిన్ రోడ్డుపై తరుచూ సీవరేజీ ఓవర్‌ఫ్లో అవుతున్నది. ఇటీవల ఎండీ అశోక్ రెడ్డి అక్కడ పర్యటించిన సమయంలో ఈ విషయం తెలియడంతో కనెక్షన్ కట్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆ రెస్టారెంట్ సీవరేజీ పైపులైన్ తొలిగించినట్టు అధికారులు తెలిపారు. క్రమంగా నల్లా, సీవరేజీ కనెక్షన్లు ఉన్నవారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని అశోక్‌రెడ్డి కోరారు. ఆసుపత్రులు, హోటల్స్, బేకరీలు, మాల్స్ తదితర వాణిజ్య, బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్వాహకులు తప్పనిసరిగా సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. జలమండలి నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజీ పైప్‌లైన్ కనెక్షన్ తీసుకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. కాగా, ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజీ కనెక్షన్లు గుర్తిస్తే బలమండలి విజిలెన్స్ బృందానికి 9989998100, 9989987135 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

డిసెంబర్ 1 వరకు యూపీఎస్సీ ఇండియన్

ఫారెస్ట్ సర్వీస్ మెయిన్ పరీక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ మెయిన్ పరీక్షలకు హైదరాబాద్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్ఓ వెంకటాచారి తెలిపారు. ఆదివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో 222 అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూపీఎస్సీ డైరెక్టర్ మనోజ్ దేహురి పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 23: దైవదర్శనానికి వెళ్తున్న ఓ దంపతులను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఘట్‌కేసర్ అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి యంనంపేట్ చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలు మన్నె లక్ష్మయ్య(55), నాగజ్యోతి యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్తుండగా వెనుకాల నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న లక్ష్మయ్యకు తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకాల కూర్చున్న నాగజ్యోతికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు, బాధితురాలిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పటాన్‌చెరువుకు చెందిన దంపతులిద్దరూ యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒడిశా కేంద్రంగా నగరానికి గంజాయి

114కిలోల గంజాయి పట్టివేత.. ఏడుగురి అరెస్ట్

స్వాధీనం చేసుకున్న గంజాయితో డీసీపీ సుధీంద్ర, సిబ్బంది

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ):ఒడిశా కేంద్రంగా నగరానికి పెద్దఎత్తున గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టును నగర హెచ్‌న్యూ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో నలుగురు గంజాయి సరఫరాదారులు, ఇద్దరు రవాణాదారులు, ఒక విక్రయదారుడు మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.50 లక్షల విలువజేసే 114 కిలోల గంజాయి, 8 సెల్‌ఫోన్‌లు, రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీ ఎస్.సుధీంద్ర కథనం ప్రకారం... ఏపీలోని అనకాపల్లికి చెందిన బల్లి గోవింద్ ఇంటర్మీడియట్ వరకు చదివి మధ్యలోనే చదువు ఆపేశాడు. కొంత కాలం స్వస్థలంతోపాటు హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేశాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో 2011లో నగరం నుంచి తిరిగి తన స్వస్థలానికి వెళ్లి కూలీ పనులు చేశాడు. అనంతరం 2015లో కిరాణా దుకాణం తెరిచాడు. ఈ క్రమంలో ఒడిశాలో గంజాయి సాగుచేసే వారితో ఏర్పడిన పరిచయాలతో కిరాణా దుకాణం ముసుగులో గంజాయి విక్రయించడం మొదలుపెట్టాడు. క్రమంలో ఏపీ సరిహద్దు ఒడిశాలోని చిత్రకొండ అటవీ ప్రాంతంలోని గంజాయి సాగుచేసే వారి వద్ద కిలో రూ.1,500 చొప్పున కొనుగోలు చేసి హోల్‌సేల్ విక్రయదారులకు కిలో రూ.5వేల చొప్పున విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో అనకాపల్లికి చెందిన అడిగర్ల ప్రకాశ్‌కుమార్, మలసాల మోహన్‌రావులు గోవింద్‌తో చేతులు కలిపి అతడి వద్ద కిలో రూ.5వేలు చొప్పున గంజాయి కొనుగోలు చేసి మార్కెట్లో కిలో రూ.10వేల చొప్పున విక్రయిస్తున్నారు. అయితే గంజాయి సరఫరా చేసేందుకు రాజన దుర్గ హరిప్రసాద్‌ను నియమించుకున్న గోవింద్ అతడికి ప్రతి 2కిలోల గంజాయికి రూ.1500చొప్పున కమీషన్ చెల్లించేవాడు. ఈ క్రమంలో పరిచయాలు పెంచుకున్న హరిప్రసాద్ సొంతంగా గంజాయి సరఫరా చేయడం మొదలుపెట్టాడు. కాగా, అదే ప్రాంతానికి చెందిన కోడి రమణకు హరిప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో రమణ సైతం హరిప్రసాద్ వద్ద గంజాయి కొనుగోలు చేసి విక్రయించడం మొదలుపెట్టాడు. అయితే ఇతర ప్రాంతాలకు గంజాయి రవాణా చేసేందుకు హరిప్రసాద్ తనకు పరిచయం ఉన్న ఎల్.గంగాధర్, వై.గంగాధర్‌లను ఎంపిక చేసుకుని వారి ద్వారా ఆయా ప్రాంతాల్లో గోవింద్ సూచించిన వారితో పాటు తనకు పరిచయం ఉన్న గంజాయి విక్రయదారులకు పెద్దఎత్తున సరఫరా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న నగర హెచ్‌న్యూ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాచిగూడ పోలీసులతో కలిసి శనివారం గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.50లక్షల విలువజేసే 114కిలోల గంజాయి, 8 సెల్‌ఫోన్‌లు, 3200 నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును కాచిగూడ పోలీసులకు అప్పగించారు.

గంజాయి సాగు.. ఐదేళ్లు జైలు

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): గంజాయి సాగు చేసిన వ్యక్తికి సంగారెడ్డి జిల్లా ఫస్ట్ అడిషనల్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చింది. వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం, పెద్దలోని గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేశాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న అబ్కారీ అధికారులు 2018లో సదరు వ్యవసాయ భూమిపై దాడులు జరిపి 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వెంకటేశంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు విచారించిన సంగారెడ్డి జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి జయంతి నిందితుడికి ఐదేండ్లు జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ శనివారం తీర్పు చెప్పింది.

నగరంలో పలుచోట్ల అబ్కారీ దాడులు

విదేశాల్లో లభించే ఓజికుష్ అనే ఖరీదైన గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.75 లక్షల విలువజేసే 57 గ్రాముల ఓజికుష్ విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... భాను, మోహిత్, రాహుల్ కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో వీరు బెంగళూరు నుంచి ఓజికుష్ గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న అబ్కారీ పోలీసులు శనివారం యాప్రాల్‌లో నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. మరో కేసులో తిరుమలగిరి యాదవనగర్‌కు చెందిన తేజ, వీరసాయి, ఏ.సాయికిరణ్, కె.రమణ రాయన్, జి.చంద్రశేఖర్ స్థానికంగా గంజాయి విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్